# శూర్పణఖ

## [శ్రవ్యం]

శ్రీ రుక్మిణీనాథశాస్త్రి

[పంచవటి ప్రాంతాలు. గోదావరి ఒడ్డున. హేమంతకాలం, మధ్యాహ్నం సాయాహ్నంగా మారిపోతున్న వేళ. శూర్పణఖ. ఆమె చెలి వనలతా !]

శూర్పణఖ : నీవు ఎంత చెప్పినా, నా మనస్సు మారటంలేదు.

వనలత : నీవు, నీ విషయమై వచ్చేసరికి, బేలవై పోతున్నావు. పదిమందికి సర్ది చెప్పగలదానివి! మనసును అదుపులోకి తెచ్చుకోలేక పోతున్నావా అక్కా !

శూర్ప : [ఆలోచిస్తున్నట్లు] అక్కడికీ మనస్సును నేను ఎంతెంత కట్టి పడేస్తున్నానో నీకు తెలీదు వనలతా! రాముడు, సీతాలక్ష్మణులతో చిత్రకూటానికి వచ్చాడన్న మాట విన్నప్పుడే వొళ్లు జలదరించింది. మనస్సు ఝల్లుమంది. చిత్రకూటానికే పోదామనుకున్నాను.

వనలత : మంచిపని చేద్దామనుకున్నావు !

శూర్ప : తగినంత పెరగనిదీ, వాంఛేకాదు, బులబాటం అవుతుంది. ఉపేక్షకు అన్నీ లొంగి పడి ఉంటై అని ఉపేక్షచేసి, చూచాను.

వనలత : ఇప్పుడవన్నీ ఎందుకు ? మనస్సు మళ్లించుకో.

శూర్ప : పంచవటికి వచ్చారు. ముని వేషధారులై, పర్ణశాలా నివాసం చేస్తున్నారని విన్నానూ, లంకలో నిమిషం ఉండలేక పోయాను. [నిట్టూరుస్తుంది]

వనలత : అక్కా శత్రువుల మీదా వలపు ? తగదు.

శూర్ప : అపరాని వాంఛ, అక్కడే ప్రత్యక్షశాత్రవం! పరమేశ్వరుడు ఇంత పరీక్ష చేసిగాని విడువడు కాబోలు వనలతా.

వనలత : పరమశివుణ్ణే తలుచుకో. ఆ దేవదేవుడు మదనాంతకుడు.

శూర్ప : పంచవటికి వచ్చాను. లక్ష్మణుడు, ఎదురైనాడు. అతనే రాముడనుకున్నాను. పలకరించాను. కసిరాడు. రాముడు, మందహాస సుందరుడని కాదూ మరి! పోటు మానిసి రాముడు కాడని వెంటనే తెలిసింది. ముందుకు పోదామనుకున్నాను. లక్ష్మణుడు ముందుకు సాగనీయలేదు.

వనలత : అంత అనుమానం వారికి మనమంటే అక్కా ! నా మాటవిను.

శూర్ప : నా మాట విను వనలతా ! లక్ష్మణుడు, వాడు ఆ లక్ష్మణుడు బహుజాగరూకుడు. అతణ్ణి సమాధాన పరచడం వృధా అని, అతను లేకుండా చూచి, మళ్లా వెళ్లాను.

వనలత : పా.....పం !

శూర్ప : ఆ కాస్తసేపూ ఎంత బాధ పడ్డానని. [బరువుగా] చివరికి వెళ్లాను.

వనలత : ఊఁ.

శూర్ప : రాముడు, హృదయాభిరాముడు, సీతకు ఏదో కథ చెప్పుతున్నాడు. ఆ సీత, మైమరపించే కన్నుల సీత, రాముడి ఒళ్లో తల పెట్టుకుని పడుకుని కథ వింటోంది. [బాధగా] అప్పుడే నా పై ప్రాణాలు పైన పోయాయి ! నేను ఆగలేను. రాముడికి నా హృదయాన్ని నివేదించనిదే జీవింపలేను వనలతా ! మళ్లా వెళ్లిచూస్తాను !

వనలత : [బరువుగానే] నీ అదృష్టం ఎలావుందో పద.

[పర్ణశాలలో సీతా, రాముడూ]

రాముడు : సీతా ! నిన్నింత కష్టాలపాలు చేస్తున్నాగదా. రాకుమారివి, బహు సుకుమారివి. అంతఃపురానికి తగిన దాన్ని అడవుల పాలు చేశానే అన్న వ్యథ—

సీత : [వద్దన్నట్లు] ఆర్యపుత్రా !

రాముడు : నిజంగా, సీతా. ఒక ధర్మం ఒక ఆదర్శం అని వీటికై జన్మంతా ధారపోయడానికి నేను పుట్టాను. ఎక్కడున్నా నాకు ఒకటే. అయోధ్య అయినా సరే అడవి అయినా సరే ఇబ్బందిలేదు. అదే నా సేవారంగం కాగలదు. కాని, సీతా—

సీత : నాకూ అదే సేవారంగం. అదే స్వర్గం, పైగా—ఈ తమాలలతలు, సాంద్రగోదావరి, గోదావరి సన్నని సంగీతం, మనోజ్ఞ కింశుక ప్రవాళాల ధగధగలు, స్వామీ మిధిలలోనూ అయోధ్యలోనూ కానవచ్చేవి కావు. ఈ దండకకే రామంటే ఈశ్వర చిద్విలాసాన్ని యింత చవి చూచే దాన్ని కాదు. కాక నా స్వామి రామచంద్రులు ఎక్కడ ఉంటే అదే నా స్వర్గం.

రాముడు : ఇది ఉపద్రవమైన భూమి సీతా. జన స్థానం బహు దగ్గర. పాముని చోట కాపురం ఉన్నట్లుగా ఉందిక్కడ.

సీత : నా రాముడున్నాడు. నా రాముడు, కోదండరాముడు! అసహాయశూరుడు మా మరిది. సమస్త లోకమూ ఏకమై వచ్చి పడితేనేమి ?

రాముడు : [నవ్వుతాడు]

సీత : [ధనుస్సు—పుచ్చుకుని] స్వామీ మీరు ధనుర్ధారులై నుంచుంటే, ఒక్క వ్యాళి మేమిటి! కోటి పడగలెత్తి నట్లుండి గాండ్రించే మహాసముద్రం సైతం గడగడలాడి పోదా ?

రాముడు : సీతా! ఈ రాక్షసి మూకలది నయవంచన. [ఆగి] సరేకాని సీతా! వీరికి పసుపు అంటే యింత పిచ్చేమిటి ?

సీత : అది వారికి శుభకరమైనది కాబోలు.

రాముడు : పసుపు పసుపుపసుపు. మెడకు పసుపు ముఖాలకు పసుపు బట్టలకు తామున్న నివాసాలకు అన్నింటికీ పసుపు.

సీత : నల్లటివారు కాదూ, ఆ నల్లటి ముఖాలపై పసుపు ఎంతో బాగుంటుంది.

లక్ష్మణ : [దూరంగా] అన్నయ్యా !

సీత : రావయ్యా !

లక్ష్మణ : [దగ్గరగా] గోదావరి దగ్గిరికి పోతాను. హంసలు రమ్యంగా నాట్యం చేస్తున్నవి.

రాముడు : పోయి చూచిరా తమ్ముడూ.

లక్ష్మణ : వస్తాను.

సీత : [నెమ్మదిగా] ఊర్మిళకూడా వచ్చి ఉంటే ఎంతో బాగుండేది.

రాముడు : [బరువుగా] కాదూ సీతా. [ఆగి] పరిశుభ్రమైన జలం—

సీత : తెస్తున్నా. ఈ గోదావరీ నిర్మల సలిలాలు. ఈ అనుకూల మృదుపవనాలు! ఇక్కడిదెంత రామణీయకము !

రాముడు : సీతా !

సీత : దాహంవేస్తున్నది కాబోలు. ఆర్యపుత్రా ! గోదావరికి పోయి తీసుకురావలె. ఒక్కలిప్త తాళండి. క్షణంలో తెస్తాను.

రాముడు : సీతా !

సీత : తెచ్చేస్తున్నాను. హంసల నృత్యాన్నిచూస్తూ మైమరచి ఉండను. వచ్చేస్తున్నా. ఎవరో వస్తున్నారు. స్త్రీ. యీ స్త్రీలెంత సుందరులు ! తెల్లనిచీర. అక్కడక్కడ కొద్దిగా పసుపువర్ణ లేపనమూ. ఏ కల్యాణ కామనతో వస్తున్నారో ఆమె. ఎదురుగా వెళ్లితే—"సుమంగలి ఎదురుపడింది, వచ్చినపని అవుతుందని," ఆమె ఎంతో సంతోషిస్తుంది !

రాముడు : సీతా !

సీత : వెళ్లుతున్నా. ఆలస్యంకానీను వచ్చేస్తున్నా—రండి ! రండి !—

రాముడు : అమ్మా రండి. సుఖంగా కూర్చోండి.

శూర్పణఖ : చిత్రకూటంనుంచి వచ్చారా, చిత్రకూటానికే వచ్చి, స్వాగతమిద్దామనుకున్నాను. పడింది కాదు. సుఖంగా ఉంటున్నదా ఇక్కడ ?

రాముడు : [నవ్వి] ఆ !

శూర్పణఖ : యివన్నీ అంత మంచి ప్రదేశాలు కావు. ఉరగ ఘోరణాలు. స్వామీ ఎంతో దూరం లేదు లంక, తమ అయోధ్య కంటె, దగ్గిరే. మా లంకకువచ్చి, తాము నివసించగూడదూ ?

రాముడు : [నవ్వి] వీలుకాదు.

శూర్పణఖ : లంక బహు సుందరమైనది.



రాముడు : [మౌనం].

శూర్పణఖ : నన్ను అనుగ్రహించి, దాసిగా, సఖిగా[ఆగి]భార్యగా.

రాముడు : అనగూడని మాటలివి కల్యాణీ.

శూర్పణఖ : ధర్మచ్యుతిలేదు, ఆర్యపుత్రా !

రాముడు : చెవులు మూసుకుంటున్నాను. ఆర్యపుత్రా అని నన్ను పిలవ నర్హురాలు సీత ఒక్కతే. మీరు వెళ్లండి.

శూర్పణఖ : (ఆశగా) రామా !

రాముడు : (గట్టిగా) సీతా ! సీతా !

సీత : [దూరంగా]వస్తున్నా. (వచ్చి) నిర్మలోదకం ఇదిగో.

రాముడు : అనే విన్నాను.

శూర్పణఖ : మా అన్న లంకేశ్వరుడు, సౌమ్యసుందరుడు. మీరువచ్చి, మా దేశాన్ని అలంకరించాలని నా కోర్కె.

రాముడు : [నవ్వుతాడు].

శూర్పణఖ : నిత్య శివార్చనలతో పరమపావనమైన మా లంకను తాము చూస్తే-విడువరు.

రాముడు : తమ నామధేయం చెప్పారు కాదు.

శూర్పణఖ : శూర్పణఖ.

రాముడు : అన్వర్థమైన పేరు. మీ గోళ్లు పెద్దవికదూ మరి.

శూర్పణఖ : ధన్యను.

రాముడు : [బరువుగా] ఆ ! ఏమిటీ ?

శూర్పణఖ : స్వామీ, దాసి విన్నపం. ఈ నా హృదయ పంకజము, తమ పాదాలకు సమర్పితమైనది. నా పంచ ప్రాణాలూ, లీలా శుకమై మీ చేతిని వ్రాలినవి.

రాముడు : ఈమె—

శూర్పణఖ : సీతా ! చెల్లెలు నమస్కరిస్తోంది.

రాముడు : సీతా ! వెళ్లిపొమ్మను—

సీత : ఏమమ్మా ! తామెవరు ?

రాముడు : సీతా !

సీత : ఇంటికివచ్చిన అతిథి. రా అమ్మా. పర్ణశాలలోనికి రా.

రాముడు : (వినవేమి అన్నట్లు) సీతా !

సీత : నవ్వు ముఖం ఇంతలో మారింది. అమ్మా రామచంద్రుల్ని ఏమన్నా, నొప్పించావా ?

శూర్పణఖ : సీతా !

రాముడు : [మాట వినవేం] సీతా !

సీత : అసమయంలో వచ్చినట్లున్నావు తల్లీ. రామచంద్రులిప్పుడు మాట వినరు.

రాముడు : సీతా !

శూర్పణఖ : [దీనంగా] రామా ! రామా !

సీత : మా మరిది స్నానంచేసి వస్తున్నాడు. వెళ్లమ్మా. వెళ్లి ఆయనతో చెప్పుకో. రామచంద్రులతో చెప్పినట్లే. అంతా అతను వింటాడులే.

శూర్పణఖ : రామా ! [నిష్క్రమణ].

సీత : పాపం వెళ్లింది. ఎందుకలా కసరి పొమ్మన్నారు ?

రాముడు : [మౌనం].

సీత : నాగ్గూడా చెప్పగూడదా ?

రాముడు : [విసుగ్గా] కాముకి !

సీత : ఊఁ ?

[ప్రక్కనే ఉన్న గోదావరి ఒడ్డున వృక్షచ్ఛాయన వ్యధాకుల శూర్పణఖా, చెలి వనలతా]

వనలత : ఎంత అన్యాయం జరిగిందీ...?

శూర్పణఖ : చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం.

వనలత : ఇంత పరాభవమటే, ఎంత క్రొవ్వి ఉన్నారు వారు ?

శూర్ప : ప్రేమకు పరాభవమేమిటి, అందరూ ప్రేమించి తమతమ జన్మలను సార్థకం చేసుకుంటారు. దౌర్భాగ్యురాలిని, ప్రేమించి ప్రేమించి ముక్కూ చెవులూ కోయించుకున్నాను.

వనలత : విన్నావుగదా. వారు ఆర్యులు. వారికి నల్లని శరీరం ఉజ్జ్వలమైన నేత్రాలూ గిట్టవు. అంటే ! పైగా, నీ వెర్రిగాని అక్కా. మన్ని తుదముట్టించను వచ్చిన వారు మన వినాశనం తమకు ఉత్సవం అనుకునేవారు మన్ని ప్రేమిస్తారటే—?

శూర్ప : ప్రేమ హృదయానిదే. హిత శాత్రవాలు అలా కావనుకున్నా.

వనలత : కటికవాడు, ఆ లక్ష్మణుని దగ్గరకు పోకుండా తిరిగి రావలసింది !

శూర్పణఖ : రత్నం దొరకనప్పుడు, గాజుపూసకే మొహం వాచిపోయినట్లు వెళ్లాను. అనుభవించవద్దా చేసుకున్న కర్మ ?

వనలత : వారూ అనుభవింపక పోరులే ! యింతకు పదింతలు అనుభవానికి రాకపోదు.

శూర్పణఖ : నిద్రపోనిస్తామా ! (నిట్టూరుస్తుంది) లే వనలతా, [కోపంగా] పద !

[ఆలిండియా రేడియో ఆదరాభిమానాలతో].

★

